క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

తాడ్వాయి(ఎల్లారెడ్డి): దేమికలాన్‌లో సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. గ్రామానికి చెందిన మర్రి లింగారెడ్డి అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో మృతుడి భార్య మర్రి గంగామణికి రూ.60 వేల విలువ గల చెక్కును అందించారు. సర్పంచ్ దిడిగే పోరాజు, ఉప సర్పంచ్ ఇందిర, ఎంపీటీసీ నర్సవ్వ పాల్గొన్నారు.

బెంచీలు, క్రికెట్ కిట్ల పంపిణీ



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు, రాంసుఖ్ బాల్ ముకుంద్ ఇనాని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సోమవారం ప్రముఖ పారిశ్రామికవేత్త దయానందరెడ్డి సహకారంతో డెస్క్ బెంచీలు, క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లు అందించినట్లు పాఠశాల హెచ్ఎం భీమ్‌రావ్ తెలిపారు. జుక్కల్ పీజీ హెడ్మాస్టర్ సీతయ్య ద్వారా మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు 45 డెస్క్ బెంచీలు, వాలీబాల్ కిట్, రెండు క్రికెట్ కిట్లు అందించారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వాలీబాల్ కిట్ అందించారు. వెనకబడిన గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలని ఈ కిట్లు అందించినట్లు దాత పేర్కొన్నారు.

నిత్యావసర సరుకులు..

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పడమటి నగేష్ నివాసపు రేకుల ఇల్లు ఈ నెల 16న దగ్ధమైంది. ఈ ఘటనతో పడమటి నగేష్ కుటుంబం సర్వం కోల్పోయారు. వారు కట్టు బట్టలతో మిగిలారు. విషయం తెలుసుకున్న వారధి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సోమవారం బాధితుడికి సరుకులతో పాటు కొంత నగదును అందజేశారు. వారధి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు గోపాల్ సింగ్ ఠాకూర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి లయన్స్ క్లబ్ 2022–23 సంవత్సరంలో కంటిపరీక్షలు, రక్తదానం, ఆరోగ్య శిబిరాలు, పర్యావరణం, పాఠశాలల్లో చేసిన సేవా సామాజిక కార్యక్రమాలకు గాను ఏకంగా 15 అవార్డులు సాధించింది. హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన లయన్స్ కనెక్ట్ కార్యక్రమంలో అవార్డులు అందుకున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పీవీ నర్సింహం తెలిపారు.

యువతి అదృశ్యం

కామారెడ్డి క్రైం: క్యాసంపల్లికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు. గ్రామానికి చెందిన జనగామ అనిత పెద్ద కుమార్తె ఈ నెల 17న ఉదయం తన నానమ్మ, తాతలతో కలిసి కామారెడ్డిలోని ఓ డెంటల్ ఆస్పత్రికి వెళ్లింది. వారు ఆస్పత్రిలో ఉండగా ఫోన్ వచ్చిందంటూ బయటకు వచ్చింది. మనవరాలు ఎంతకీ తిరిగి రాకపోవడం, ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

నివాళులు

భిక్కనూరు: స్వాతంత్ర సమరయోధుడు బాగారెడ్డి సతీమణి అన్నపూర్ణమ్మకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సోమవారం ఘన నివాళులర్పించారు. అన్నపూర్ణమ్మ ఈనెల 8న మృతి చెందింది. సోమవారం భిక్కనూరు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. అన్నపూర్ణమ్మ కుమారులు నర్సింహరెడ్డి, రాంరెడ్డిలను ఓదార్చారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, ఎంపీపీ గాలిరెడ్డి, జడ్పీటీసీ గాలిరెడ్డి పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనం పరిశీలన

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ బీసీ గురుకుల పాఠశాలలో సోమవారం ఎంఈవో నాగేశ్వరావు, ఎంపీపీ రఘు కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు.

సభా స్థలం..

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండల కేంద్రంలో మంగళవారం జరిగే స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సభ ప్రాంగణాన్ని ఎంపీపీ రఘు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు నిర్వహించే విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో భాను ప్రసాద్, ఎంపీటీసీ సందీప్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కామారెడ్డి టౌన్: పట్టణంలోని 4వ వార్డుకు చెందిన బీఆర్ఎస్, బీజేపీల కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో వీరు పార్టీలో చేరారు. ప్రజలు బీఆర్ఎస్, బీజేపీలపై నమ్మకం లేక కాంగ్రెస్ వైపు చూస్తున్నారని షబ్బీర్ అలీ అన్నారు. బస్సా సాయిలు పాల్గొన్నారు.

జీపీ బాధ్యతలు మాకొద్దు బాబోయ్!

- బిచ్కుంద వార్డు సభ్యుల వేధింపులే కారణమంటున్న కార్యదర్శులు, అధికారులు
- గడిచిన నాలుగేళ్లలో బిచ్కుంద జీపీకి ఏడుగురు కార్యదర్శులు మారిన వైనం



బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకోవడానికి కార్యదర్శులు జంకుతున్నారు. పాలక సభ్యుల వేధింపులతో గత నాలుగేళ్లలో ఇప్పటి వరకు ఏడుగురు కార్యదర్శులు మారారు. గ్రామ పంచాయతీకి 16 మంది వార్డు సభ్యులు ఉన్నారు. 16వ వార్డు సభ్యుడు రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఒకరు ఉప సర్పంచ్, 14 మంది వార్డు సభ్యులు ఉన్నారు. ఇందులో కొందరు సభ్యులు మా వార్డులలో బోరు మోటారు కాలిపోయింది.. పైపులైన్ పగిలిపోయింది.. ఇతర పనులు స్వయంగా నేను చేశానని బిల్లులు తీసుకొస్తారు. బిల్లుకు సంబంధించిన డబ్బులు ఇవ్వాలని కార్యదర్శిపై ఒత్తిడి చేస్తారు. బోరు మరమ్మతుల కోసం జీపీ రిజిస్టర్‌లో రాయాలి.. తమకు సమాచారం ఇవ్వకుండా ఎలా పనులు చేశారు.. రూ.వేలల్లో బిల్లులు చెల్లించలేనని చెప్పిన కార్యదర్శులకు వేధింపులకు గురి చేస్తారని అధికారులు, కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు సభ్యులు ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు జీపీలోనే మకాం వేస్తారు. అధికారులు సమయపాలన పాటించకపోవడం, పని ఒత్తిడిలో చేసిన తప్పులను వార్డు సభ్యులు ఆసరాగా తీసుకొని బిల్లు చెల్లించు లేకుంటే ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని బెదిరింపులకు పాల్పడతారని జీపీ సిబ్బంది వాపోతున్నారు.

ఎవరూ ముందుకు రాకపోవడంతో..

కార్యదర్శి బాధ్యతలు స్వీకరించడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో గ్రామంలో సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయి. వర్షాకాలం వస్తుండడంతో డ్రైనేజీ మరమ్మతులు చేసేవారు లేరు. రోడ్లపై మురికి ప్రవహిస్తోంది. ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్ హన్మంత్‌రావుకు అధికారులు కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.

తీర్మానాలు, ప్రొసీడింగ్ లేకుండానే పనులు..

పంచాయతీ పాలకవర్గ సభ్యులు తీరు ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో కొనసాగుతుంది. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు వ్యవహరిస్తూ జీపీ నిధులు మంజూరైన వెంటనే చేపట్టాల్సిన పనులకు సంబంధించిన తీర్మానాలు, అధికారుల నుంచి ప్రొసీడింగ్ లేకుండానే నాణ్యత పాటించకుండా పనులు చేపడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. నిధులు మంజూరు కాకముందే రెండు, మూడు తీర్మానాలు తీసుకొని సభ్యులు దగ్గర పెట్టుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్వాన్స్‌గా తీర్మానాలు తీసుకుంటున్నారు. మరికొన్ని పనులకు తీర్మానాలు లేకుండానే చేస్తున్నారు. సంవత్సరం క్రితం 14వ వార్డు సభ్యుడు తీర్మానం లేకుండా, నిధులు మంజూరు కాకముందే అధికారులు అనుమతి లేకుండానే రూ.6 లక్షల నిధులతో మురికి కాలువలు నిర్మించారు. బిల్లు కోసం ఎంబీ రికార్డు చేసి ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. పనుల్లో నాణ్యత లేదని సీఎం కార్యాలయానికి వార్డు ప్రజలు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ నుంచి క్వాలిటీ కంట్రోల్ అధికారులు వచ్చి పనులు పరిశీలించారు. నాణ్యత లేదు బిల్లులు చెల్లించవద్దని పంచాయత్‌రాజ్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఆదేశాలు జారీ చేశారు. అయినా కూడా ఇటీవల బిల్లులు చెల్లించాలంటూ వార్డు సభ్యులు ఓ సారి జీపీ కార్యాలయానికి తాళం వేశారు.

జొన్నలు కొనుగోలు చేయండి సారూ..!



పిట్లంలో దెబ్బతిన్న జొన్న పంటను కొనుగోలు చేయాలంటూ ధర్నా చేస్తున్న రైతులు

పిట్లం(జుక్కల్): మండలంలోని పలు గ్రామాలలో రైతులు రబీ పంట కింద వరి, మొక్కజొన్నతో పాటుగా జొన్న కూడా సాగుచేశారు. పంట పెట్టుబడి కూడా తక్కువ అవుతుందనే ఉద్దేశంతో పిట్లం, రాంపూర్, బుర్నాపూర్, అల్లాపూర్, తిమ్మానగర్, హస్నాపూర్, చిన్న కొడప్ గల్ తదితర గ్రామాలలో సుమారు 6 వేల ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి రావడంతో పంటను అమ్ముకునేందుకు స్థాని క వ్యవసాయ మార్కెట్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్న పంట కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట కొద్దిగా దెబ్బతింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో పంట కొద్దిగా నల్లగా ఉన్నా కొనడం లేదు. దీంతో ఎక్కడ అమ్ముకోవాలనే దిగులుతో రైతులు ఉన్నారు. రైతుల సంక్షేమం గురించి ఆలోచించే ప్రభుత్వం మరి ఏ–గ్రేడ్, బీ–గ్రేడ్ జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో క్వింటాలు జొన్నల ధర రూ. 2970 ఉంది. దెబ్బతిన్న జొన్న పంటలను ఆసరాగా చేసుకుని దళారులు రూ.1200 నుంచి 1400లకే అడుగుతున్నట్లు రైతులు వాపోతున్నారు. దెబ్బతిన్న పంటల్ని కొనుగోలు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై సోమవారం రైతులు ధర్నా రాస్తారోకో చేశారు. వారికి బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు.

రోజూ పడిగాపులు కాస్తున్నాం

పంట చేతికి రాగానే అమ్ముకుందామనే ఉద్దేశంతో పిట్లం మార్కె ట్ యార్డుకు జొన్నలు తీసుకొచ్చాం. అధికారులు దెబ్బతిన్న జొన్న పంటను కొనుగోలు చేయకపోవడంతో పడిగాపులు కాస్తున్నాం. బయట అమ్ముదామంటే మద్దతు ధర లేదు. ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం దయ ఉంచి కొనుగోలు చేస్తే బతికి బయట పడతాం.

– విఠల్, రైతు, బుర్నపూర్

సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట

- ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్



కంచర్లలో మొక్కలకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే గంప గోవర్ధన్, అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

భిక్కనూరు: ప్రజా సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్ద పీట వేశారని కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. సోమవారం భిక్కనూరు మండలం కంచర్లలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి వీధి తనకు తెలుసునని సమస్యలు ఏమి ఉన్నాయో తెలుసుకుని వెంటనే పరిష్కరిస్తానన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేతో కలిసి మొక్కలను నాటి నీరు పోశారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబోద్దీన్, ఎంపీపీ గాలిరెడ్డి, జెడ్పీటీసీ పద్మనాగభూషణం గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, సర్పంచ్ చంద్రకళ మాధవరెడ్డి పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు



సుభాష్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న నేతలు

ఎల్లారెడ్డి: రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి జోస్యం చెప్పారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో గాంధారి మండలంలోని మర్లకుంట తండాకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నాయకులు జనార్ధన్‌రెడ్డి, అఫీజ్ తదితరులున్నారు.

పలు గ్రామాల్లో గడప గడపకి కాంగ్రెస్

ఎల్లారెడ్డి: పలు గ్రామాలలో సోమవారం గడపగడపకి కాంగ్రెస్ నిర్వహించినట్లు పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ తెలిపారు. సోమవారం సాతెల్లి, రేపల్లెవాడ గ్రామాలలో కాంగ్రెస్ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించినట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని గండిమాసానిపేట గ్రామ మాజీ సర్పంచ్ ముస్త్యాల వెంకటేశం సోమవారం పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ

బీబీపేట: శివారు రాంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదులకు సోమవారం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి చేతుల మీదుగా భూమిపూజ చేశారు. రెండు గదులకు రూ. 22 లక్షలు, ఎలక్ట్రిషన్ రూ.72,468, తాగునీరు సప్లై రూ. 83,820, తదితర పనులకు రూ. 2, 42,106 నిధులు మంజూరైనట్లు వారు తెలిపారు. ఎంపీపీ బాలమణి, సర్పంచులు ప్రభాకర్, వెంకట్‌రావు, ఎంపీటీసీ లక్కరసు రవి పాల్గొన్నారు.

స్వాగత తోరణానికి..

దోమకొండ: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద గల కాలనీకి స్వాగత తోరణ నిర్మాణానికి సోమవారం గ్రామ సర్పంచ్ నల్లపు అంజలి భూమిపూజ నిర్వహించారు. జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారద, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య ఉన్నారు.

ఘనంగా హరితోత్సవం



లింగంపేటలో ..



రాఘవపల్లిలో ..

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో ప్రజాప్రతినిధులు, స్థానిక అధికారులతో కలిసి మొక్కలు నాటి నీళ్లు పోశారు. మొక్కలను సంరక్షించాల్సి బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మానవ మనుగడ మొక్కలపై ఆధారపడి ఉందని వారు వ్యాఖ్యానించారు. – సాక్షి నెట్‌వర్క్



ఎల్లారెడ్డి: మొక్కలు నాటుతున్న కౌన్సిలర్లు



బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో..స్పీకర్



దోమకొండలో.. ప్రజాప్రతినిధులు, అధికారులు



సదాశివనగర్‌లో .. సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి



గాంధారిలో.. ఎంపీపీ రాధాబలరామ్ నాయక్



జిల్లా గ్రంథాలయ సంస్థలో.. చైర్మన్ రాజేశ్వర్



బీబీపేటలో ..



మల్కాపూర్‌లో .. ఎంపీపీ, జెడ్పీటీసీ



బిచ్కుందలో ..



చిన్నకొడప్‌గల్‌లో.. సర్పంచ్ కవితారెడ్డి



తాడ్వాయి: చిట్యాల గ్రామ శివారులో..

సీఐగా పదోన్నతి.. స్నేహితుల సన్మానం



భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన క్రైమ్ ఫ్రీ ఇండియా వ్యవస్థాపకుడు, సీసీఎస్ ఎస్సై గడ్డం మల్లేశ్ సీఐగా పదోన్నతి పొందడంతో ఆయన చిన్ననాటి మిత్రులు సోమవారం సన్మానించారు. ఆయన చేసిన సేవలను స్నేహితులు కొనియాడారు.

డబ్బులు సకాలంలో చెల్లించండి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రైతులకు వరి ధాన్యం డబ్బులను సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీకేఎస్ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయంలో ఆర్ఐ సాహిత్యకు వినతి పత్రం అందజేశారు. వరి ధాన్యం తూకమై నెల రోజులు గడిచినా ఇంకా డబ్బులు పడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మండలాధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ రావు, తదితరులు పాల్గొన్నారు.

'ముదిరాజ్ బంధు' కింద రూ.10 లక్షలు ఇవ్వాలి



మాట్లాడుతున్న జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ముదిరాజ్ బంధు పథకం కింద ముదిరాజ్‌లకు ప్రభుత్వం రూ.10 లక్షలు అందించాలని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు విఠల్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ కార్యాలయంలో ముదిరాజ్ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత బంధు థకం ప్రకారం ముదిరాజ్ బంధు పథకాన్ని ముదిరాజ్‌లకు అమలు చేయాలని అన్నారు. స్థానిక తహసీల్ కార్యాలయానికి వెళ్లి ఈ విషయమై వినతి పత్రం అందించారు.

మున్నూరుకాపులకు సాయం అందించాలి

మద్నూర్(జుక్కల్): ఇతర కుల వృత్తిదారులకు అందిస్తున్నట్లుగా దేశానికి అన్నం పెట్టే మున్నూరుకాపులకు ప్రభుత్వం రూ.లక్ష సాయం అందించాలని మున్నూరుకాపు కులస్తులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం మున్నూరు కాపులు

గౌడ కులస్తుల వినతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని గౌడ కులస్తులందరికీ వర్తింపజేయాలని కోరుతూ సోమవారం నాగిరెడ్డిపేట మండల గౌడ సంఘం సభ్యులు కోరారు. ఈమేరకు స్థానిక డిప్యూటీ తహసీల్దార్ రాందాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

ధాన్యం డబ్బులు ఇవ్వకుండా ఉత్సవాలు చేయడం సిగ్గుచేటు



రమేశ్ రెడ్డి

భిక్కనూరు: ధాన్యం డబ్బులు ఇవ్వకుండా దశాబ్ది ఉత్సవాల పేరిట డబ్బులు వృథాగా ఖర్చు చేయడం సిగ్గుచేటని భిక్కనూరు బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన భిక్కనూరులో మాట్లాడారు. మూడు రోజుల్లో బిల్లులు చెల్లించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. నాయకులు యాదగిరిగౌడ్, సందుగారి మైపాల్‌రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

సమాచారం..

■ 21న బాన్సువాడలో యోగా దినోత్సవం

బాన్సువాడ: ఈ నెల 21న యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మీన గార్డెన్‌లో నిర్వహిస్తున్నామని చెప్పారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్నారని వెల్లడించారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న యోగా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పతంజలి యోగా సమితి నాయకులు నాగరాజ్‌గౌడ్ సోమవారం తెలిపారు. పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో యోగా శిబిరం ఉంటుందన్నారు.

■ నేడు కృష్ణాజివాడికి జాజాల రాక

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజివాడి గ్రామానికి మంగళవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ విచ్చేయనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మద్ది మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రావు తెలిపారు. తెలంగాణా దశాబ్ది ఉత్సవాలలో భాగంగా స్థానిక పాఠశాల ఆవరణలో నిర్వహించే మన ఊరు–మనబడి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

■ మద్నూర్‌లో ఎమ్మెల్యే సింధే పర్యటన

మద్నూర్(జుక్కల్): మండలంలోని మేనూర్, పెద్ద ఎక్లార గేటు వద్ద మంగళవారం జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పాల్గొననున్నట్లు ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్ చెప్పారు.

■ తిమ్మక్‌పల్లిలో ప్రభుత్వవిప్..

కామారెడ్డి రూరల్: తిమ్మక్‌పల్లి(కె)లో మంగళవారం ప్రభుత్వవిప్ గంప గోవర్దన్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు ఎంపీపీ ఆంజనేయులు తెలిపారు.

■ బీర్కూర్‌లో విద్యా దినోత్సవం

బాన్సువాడ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బీర్కూర్‌లో విద్యా దినోత్సవం నిర్వహించనున్నట్లు బీర్కూర్ ఇంచార్జ్ మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్నారని ఆయన తెలిపారు.

సంక్షిప్తం

ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి

ఎల్లారెడ్డి: 18 ఏళ్లు నిండిన వారు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు చైతన్యగౌడ్ అన్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. నరేష్, సాయిబాబా, శంకర్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని టీజీవీపీ నాయకులు అల్లూరి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. కళాశాల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

క్రీడామైదానం పరిశీలన

తాడ్వాయి(ఎల్లారెడ్డి): సంతాయిపేట్‌లో క్రీడామైదానాన్ని సోమవారం ఎంపీడీవో రాజ్‌వీర్ పరిశీలించారు. మైదానంలో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

నెలాఖరు వరకు ఒంటి పూట బడులు నిర్వహించాలి

కామారెడ్డి అర్బన్: నెలాఖరు వరకు ఒక పూట పాఠశాలలు నిర్వహించాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ ముజీబొద్దీన్, కాంబ్లె గోపాల్‌లు కోరారు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా ఒంటిపూట బడులు నిర్వహించడం ఉత్తమమని వారన్నారు.

శిశువు కోసం రక్తదానం

కామారెడ్డి అర్బన్: మాచారెడ్డికి చెందిన 13 రోజుల శిశువుకు అత్యవసరంగా ఒ–పాజిటివ్ రక్తం అవసరం కావడంతో కామారెడ్డికి చెందిన వ్యాపారి రాకేష్ స్పందించి రక్తదానం చేసినట్టు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ బాలు తెలిపారు. రాకేష్ ఇప్పటి వరకు 13సార్లు రక్తం దానం చేశారు.

ఉపాధి హామీ ఉద్యోగులను ఆదుకోండి

కామారెడ్డి రూరల్: ఉపాధిహామీ ఉద్యోగులకు వెంటనే పేస్కేలు ఇచ్చి వారి కుటంబాలను ఆదుకోవాలని ఉపాధి హామీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ కామారెడ్డి జిల్లా చైర్మన్ సరంపలి కృష్ణా గౌడ్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కల్పించే ఉద్యోగులకే ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెర్ప్ వారికి ఇచ్చిన విధంగా పేస్కేల్ ప్రకటించి ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. నేతలు కల్పన, హరికృష్ణ, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

బాన్సువాడ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు సోమవారం బాన్సువాడలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. రాబోయే రోజుల్లో రాహుల్ ప్రధాని కావాలని ఆకాంక్షించారు. నాయకులు అబ్దుల్లా, ఖలేక్, హన్మాండ్లు, మంత్రి గణేష్ ఉన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన ప్రదర్శన

భిక్కనూరు: ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ భిక్కనూరు తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపాల్ కార్యాలయం ముందు ప్లకార్డులు ప్రదర్శించి గంట పాటు నిరసన తెలిపారు. నారాయణ గుప్తా, యాలాద్రి, నరసయ్య, రమాదేవి, సునీత ఉన్నారు.